
ప్రజాశక్తి

గురువారం 14 ఆగస్టు 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





వర్షపునీరు నిల్వలేకుండా చూడాలి

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ :లోతట్టు ప్రాంతపు డివిజన్లలో వర్షాల కారణం గా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని, రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా ఎన్టీఆర్ నగర్, బాలాజీ నగర్, ఏసి నగర్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయ మహల్ గేటు బాక్స్ డ్రైన్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పర్యటించారు. డ్రైను కాలువలపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను యజమానులే స్వచ్ఛందంగా తొలగించకపోతే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.



'సింహపురి'ని ఛిదిమేస్తారా..?

రాష్ట్ర ప్రభుత్వం పాలన సౌభల్యం కోసం... ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కాడానికి జిల్లాల పునర్విభజన చేస్తుందని ప్రచారం చేసుకుంటుంది. గత ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలను చేసింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 26 జిల్లాలను 32 జిల్లాలు చేస్తుందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేశారు..గత ప్రభుత్వం సింహపురిని చిందరవందర చేసింది.. ప్రస్తుత ప్రభుత్వం చిరిగిన విస్తరాకు చేస్తుందనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటి వరకు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతారని, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతారని ప్రచారం జరిగింది. ఇక్కడ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధి దీనిని కోరుతున్నారు. తాజాగా గూడూరును జిల్లా కేంద్రం చేస్తారని ప్రచారం జరుగుతోంది. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపితే నెల్లూరు జిల్లా ఉనికే ప్రమాదంగా మారబోతుంది. కృష్ణపట్నం గూడూరు జిల్లాకు, రామాయపట్నం ప్రకాశం జిల్లాకు వెళితే నెల్లూరు పూర్వవైభవం కోల్పోయి చిన్న ముక్కగా మిగిలిపోనుంది. దీనిని జిల్లా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారపార్టీ నేతలు దీనిని తప్పుబడుతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు...

- జిల్లాల పునర్విభజనతో అయోమయం
- ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు
- గూడూరు జిల్లా కాబోతుందా..?
- ప్రకాశం జిల్లాలో కందుకూరు
- నెల్లూరుకు మిగిలేది బూడిద

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండడం లేదు.. ఏదో చేయాలి, ఎందుకు చేయాలి,.. ఎలా చేయాలి అనే విషయాలను పరగణలోకి తీసుకోకుండా జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తోంది. గత వైసిపి ప్రభుత్వం చేసిన జిల్లా పునర్విభజనతోనే నెల్లూరు ప్రజలు ఎంతో నష్టపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకురానున్న కొత్త ప్రతిపాదనలతో మరింత నష్టపోనున్నారు. ఒకప్పుడు విక్రమ సింహపురికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉండేది. సూళ్లూరుపేట సమీపంలోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్), నేలపట్టు, వెంకటగిరి చేనేత పరిశ్రమ, గూడూరు మైకా పరిశ్రమ, ఆక్వా పరిశ్రమ, నిమ్మ పరిశ్రమ అంతా తిరుపతి జిల్లాగా మారింది. జిల్లాకు ఎంతో ప్రతిష్టాత్మకమైన వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలు తిరుపతి జిల్లాలో కలిపారు. ప్రకాశం నుంచి కందుకూరును నెల్లూరు జిల్లాలో కలిపారు. నెల్లూరుకు కేవలం 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న గూడూరును 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో కలిపారు. ఒంగోలుకు దగ్గరగా ఉన్న కందుకూరును 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న నెల్లూరులో కలిపారు. గత ఎన్నికల సమయంలోనే కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని స్థానిక ప్రజలు, నాయకులు కోరుకున్నారు. ఇందుకు అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. గూడూరు నియోజ కవర్గాన్ని నెల్లూరులో కలపాలని స్థానిక ప్రజలు, నాయకులు కోరారు. ఇందుకు చంద్రబాబునాయుడు, లోకేష్ అనుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇవి రెండు జరుగుతాయని ప్రజలు సంతోషించారు.




నెల్లూరుకు మిగిలేది బూడిదే...!

ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాపితంగా పర్యటించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. గత ప్రభుత్వంలో చేసిన విభజనే సరిగాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఇప్పుడు గూడూరు కేంద్రంగా జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తారని ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేటతోపాటు తిరుపతి జిల్లాలోని కొన్ని ప్రాంతాలు కలుపుతారని ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే సర్వేపల్లి నియోజకవర్గంలోని కృష్ణపట్నం పోర్టుతోపాటు గూడూరులో కలుపుతారని చెబుతున్నారు. నెల్లూరు పక్కనే ఉన్న సర్వేపల్లి గూడూరులో కలపే ప్రచారాన్ని స్థానిక ప్రజలు, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపితే రామాయపట్నం పోర్టు అటు వెళ్లిపోతోంది. ఆసియాలోనే అతిపెద్ద పోర్టు కృష్ణపట్నం. ప్రస్తుతం అభివృద్ధి చెందుతోన్న రామాయపట్నం పోతే నెల్లూరు జిల్లాకు మిగిలేది సోమశిల ప్రాజెక్టు. దాని కింద సాగుచేసే వ్యవసాయం తప్ప, మరేమీ నెల్లూరు జిల్లాకు మిగిలే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం గతంలో చేసిన విభజన వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు. ప్రజలు పాలన దగ్గరైన పరిస్థితులు కనిపించడం లేదు. కేవలం తన రాజకీయ ప్రయోజనాలు, నియోజకవర్గాలు పెంచుకోవడం,వంటి అంశాలవైపు ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు స్పందించకపోతే నెల్లూరు జిల్లా ఉనికికోల్పోయి. బూడిద మాత్రమే మిగులుతతందని ఆవేదన ఆందోళన జిల్లా ప్రజల్లో కనిపిస్తోంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఏపి రైతు సంఘం డిమాండ్



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో రబీ సీజన్‌లో వరిపంట కోతకు వచ్చిందని, అయినప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడంలో విఫలమైందని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఏపి రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మూలం రమేష్, సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం రబీ సీజన్‌లో దాదాపుగా 3 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతాంగం సాగుబడి చేసిందన్నారు. సుమారుగా పది లక్షల పుట్లు వరిధాన్యం దిగుబడి అయ్యే అవకాశం ఉందన్నారు. దళారులు ఇదే అవకాశంగా భావించి రైతాంగాన్ని దోచుకొనే ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించారన్నారు. ఒక పక్క వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం తడిచి ఎక్కువ నష్టపోతామా అన్న భయాందోళనలకు రైతులు గురౌతున్నారన్నారు.వీటన్నింటినీ దళారీ వ్యవస్థ, వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు తక్కువగా లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకుందుకు చర్యలు తీసుకోవాలని, మద్దతు ధర రైతులకు గిట్టు బాటు కావడం లేదని, దీనివల్ల ఏర్పడ్డ నష్టాన్ని అధిగమించేందుకు తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రకటించిన విధంగా బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో బోనస్ ప్రకటించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాల వద్ద గోతాలు లభ్యం కావడం లేదని,నెమ్ముశాతాన్ని పరిశీలించేందుకు యంత్రాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతులకు అవసరమైన మేర గోతాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భారత దేశంపై అమెరికా ప్రధాని విధిస్తున్న రకరకాల ఆంక్షల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అమెరికా భారత్‌పై తన ఇష్టానుసారంగా సుంకాలు విధిస్తుంటే దేశ ప్రధాని నోరు మెదపకపోవడం దారుణమన్నారు. బ్యాంకు గ్యారెంటీ ఉన్న మిల్లులకు మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం పంపించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడు పుట్టి ధాన్యంకు రూ.21260లు బి గ్రేడు పుట్టి ధాన్యంకు రూ. 21036లు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోపాటు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి బోనస్‌గా రూ.500లు అందజేయాలన్నారు.

'సోమిరెడ్డి'తో రైతు సంఘాలు భేటి



ఎంఎల్ఎ సోమిరెడ్డితో చర్చిస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చూసేలా అధికారులతో మాట్లాడాలని రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం ఆయన కార్యాలయంలో రైతు సంఘం నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. పదిరోజుల్లో ఎడగారు పంట కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిపించాలని వినతి చేశారు. 3 లక్షల ఎకరాల్లో కేఎన్ఎం 1638, ఎంటియూ 1010, కేఎన్ఎం 733 రకాల పంటను రైతులు సాగుచేశారని, 7 లక్షల టన్నులకు పైగా దిగుబడి లభిస్తుందని వెల్లడించారు. పంట చేతికొచ్చే సమయంలో ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అలాట్మెంట్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. రబీ సీజన్ లోనే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 80 వేల టన్నుల ధాన్యం కొనుగో1లు చేశారని గుర్తు చేశారు. రైతు సంఘాల నాయకులు తన దృష్టికి తెచ్చిన సమస్యపై వెంటనే స్పందించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో ఫోన్‌తో మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో రెండో పంట ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సివిల్ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతోనూ మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని కోరుతానని రైతు నాయకులకు హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రావూరి రాధాకృష్ణమ నాయుడు, చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షేక్ షాన్‌వాజ్, ఏవీఆర్ నాయుడు, వై.శ్రీనివాసులు రెడ్డి, పి.జనార్దన్, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, జడ వెంకటేశ్వర్లు, పి.అశోక్ కుమార్ రెడ్డి, పి. శంకరకిషోర్

అనధికార నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ :నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటరామపురం, జేమ్స్ గార్డెన్ ప్రాంతంలో అనధికార నిర్మాణాల తొలగింపు ప్రక్రియ దశను కమిషనర్ వై.ఓ నందన్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతించిన మేరకే భవనాల నిర్మాణాలను చేపట్టాలని,అతిక్రమించిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ తెలిపారు.

సహకార సొసైటీ ఛైర్మన్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -గుడ్లూరు: గుడ్లూరు సహకార సొసైటీ ఛైర్మన్‌గా గుడ్లూరుకు చెందిన దామా వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం బుధవారం చేశారు. గుడ్లూరులోని సొసైటీ కార్యాలయంలో దామా వెంకటేశ్వర్లు అధి కారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు సన్న, చిన్న కారు రైతులని ఆదుకోవడానికి సహకార సొసైటీ బ్యాంకు ద్వారా సహకారం అందించి రైతులు అభివద్ధికి పాటుపడతానని రామాయణ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు, తహశీల్దార్ విజయ భాస్కర్ ఉన్నారు.



ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

ఎంఎల్ఎ 'ఇంటూరి'కి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కందుకూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది.. ఒక్కో పిఎసిఎస్ కు ఒక ఛైర్మన్, మరో ఇద్దరిని డైరెక్టర్లుగా నియమించింది. గుడ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ గా ఎంపికైన దామా వెంకటేశ్వర్లు, పోకూరు పిఎసిఎస్ ఛైర్మన్ ఘట్టమనేని లక్ష్మీనరసింహం, దారకానిపాడు పిఎసిఎస్ ఛైర్మన్ గా నరాల మాలకొండారెడ్డి, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, టిడిపి నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, రావూరి వేణు, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు సంక్షేమం :ప్రయాణించే రైళ్లల్లో బ్యాగులు, ఇతర దొంగతనాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగా రైల్వే డిఐజి సత్య ఏసుబాబు, ఎస్ఆర్పి గుంతకల్ రాహుల్ మీనా, డిఎస్ఆర్పి జి. మురళీధర్ మార్గదర్శకాలలో నెల్లూరు రైల్వే సిఐ ఏ. సుధాకర్ నేతత్వంలో ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ఆర్పి జి.మురళీధర్ మాట్లాడుతూ ఈ తనిఖీలలో అనుమానాస్పద వ్యక్తి జన శతాబ్ది ఎక్స్ప్రెస్ లో నెల్లూరు రైల్వే స్టేషన్ బుధవారం 10 గంటల సమయంలో ఉత్తరం వైపు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా పట్టుక న్నామన్నారు. పట్టుబడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకొని మధ్యవర్తుల సమక్షంలో అతని తనిఖీ చేశావ న్నారు. అతని వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు, 143 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకునా మన్నారు. వీటి విలువ మొత్తం 12 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించండి : సిపిఎం



నేషనల్ హైవే అథారిటీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : జాతీయ రహదారికి సమీపంలోని చింతారెడ్డి పాళెం సెంటర్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిపోయిందని, ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని 16వ డివిజన్ సిపిఎం శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నగరంలోని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పగుడి ప్రాంతంలోని హైవే అథారిటీ కార్యాలయం అధికారులను కలిసి రోడ్డు ప్రమాదాల సమస్యను వివరించి చింతారెడ్డిపాళెం ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ డిప్యూటీ మేనేజర్ సుదాన్షి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కత్తి శ్రీనివాసులు, కాయంబు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చింతారెడ్డిపాలెం నుంచి నగరానికి రావాలన్నా, మెడికవర్ ఆసుపత్రికి వెళ్ళాలన్నా, లేదా నగరం నుంచి చింతారెడ్డిపాలెంకి వెళ్ళాలన్నా, తప్పనిసరిగా ప్రజలు ఈ రహదారి నుంచి ప్రయాణం చేయాల్సి ఉందన్నారు. అంతే కాకుండా విజయవాడ, హైదరాబాదు వంటి సుదూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కూడా ఇదే మార్గం ద్వారా నగరానికి చేరుతాయి. ఈ కారణంగా చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. ఈ సమయంలో రహదారి దాటే ప్రజానీకం వాహనాల వేగం అంచనా వేయడంలో పొరపాటుల కారణంగానో, లేక వాహనాల అతివేగం కారణంగానో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. మరి కొంత మంది కాళ్ళు, చేతులు కోల్పోయి బంగారు జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం 16వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలు, బాధిత కుటుంబాలు నిరసనలు చేపట్టారు. మరణించిన వారి వివరాలు, అవయవాలు కోల్పోయిన వారి వివరాలతో కలిసి ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నో వినతిపత్రాలు సమర్పించారు.అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరుతూ జాతీయ రహదారుల సంస్థ అధికారులను నెల్లూరు, విజయవాడ ప్రాంతాల్లో కలిసి విజ్ఞప్తులు చేశాం. పార్లమెంట్ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేలతో పాటు జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. ఈ క్రమంలో, అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు అయ్యిందని ప్రచారం జరుగగా, పనులు ప్రారంభం కాబోతున్నాయని చెబుతూ ప్రజలు ఆనందించారన్నారు. ఇది కేవలం ప్రచారంగా మిగిలిపోయిందని, దాంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జరుగుతున్న ప్రమాదాల తీవ్రతను గుర్తించి వెంటనే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలనికోరారు. కార్యక్రమంలో జె.సుధాకర్, కె.సంపూర్ణమ్మ, ఏ.రాజ, వి.వెంకటేశ్వర్లు, వై.వెంకి, హర్షా 16వ డివిజన్ సిపిఎం శాఖ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పోరాట ఫలితంగా

జిఓ నెంబర్ 94 విడుదల



మాట్లాడుతున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు :ఆశా వర్కర్ యూనియన్ సమరశీల పోరాటాల ఫలితంగానే లక్షా యాభైవేల గ్రాట్యూటి,180 రోజులు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, 62 సంవత్సరాల వయో పరిమితి వంటివి సాధించుకున్నామని, కూటమి ప్రభుత్వం వీటన్నింటికీ సంబంధించిన జిఓ 94 విడుదల చేసిందని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ అన్నారు. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జిఓ నెంబరు 94 విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఆశా వర్కర్స్ సమస్యలపట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీవో 94 విడుదల చేసిన ప్రభుత్వానికి, అందుకు కీలక భూమిక ను పోషించిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, వైద్యశాఖ మంత్రి కి పేరు పేరునా అభినందనలు తెలియజేశారు. ఆశాల సమస్యలైన మట్టి ఖర్చులు, సాధారణ శెలవులు, ఇన్సూరెన్స్ , వేతనం పెంపు, ప్రమోషన్లు తదితర డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ఎస్.మధుసూధన, జిల్లా కోశాధికారి కె.లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.రేణుక, జిల్లా కమిటీ సభ్యులు కళ్యాణి, అనుష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిని నెల్లూరులోనే ఉంచండి..

ఉప సంఘానికి సోమిరెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరులోనే ఉంచాలని ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉప సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన ప్రక్రియను స్వాగతిస్తున్నామని, ..కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ అమలులో భాగంగా ఉప సంఘంగా నియమితులైన మంత్రివర్యులకు అభినందనలు తెలిపారు. గూడూరు జిల్లాలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని కలుపుతారని విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, . కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని బహిరంగసభలో ప్రజలకు సిఎం నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రజలతో పాటు స్థానిక ఎంఎల్ఎ పాశం సునీల్ కుమార్ పలు వేదికలపై కోరారని తెలిపారు. ఈ విషయంలోనూ ముఖ్యమంత్రి సాను కూలంగా స్పందించిన విషయాన్ని కమిటీ దృష్టికి తెచ్చారు. . ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపితే ఎలాంటి అభ్యంతరమూ లేదని, సర్వేపల్లి నియోజకవర్గం విషయంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరు నగరానికి చుట్టుపక్కల విస్తరించి ఉందని, నెల్లూరు నగరానికి సరిగ్గా తూర్పున తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాలు ఉన్నాయని, పడమర పొదలకూరు మండలం ఉండగా, దక్షిణాన వెంకటాచలం మండలం నెల్లూరులో కలిసిపోయి ఉందన్నారు. . గూడూరు కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లా కేంద్రానికి తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, పొదలకూరు మండలాల ప్రజలు వెళ్లాలంటే నెల్లూరుకు వచ్చి వెళ్లాల్సిన పరిస్థితి. వస్తుందని పేర్కొన్నారు. కందుకూరు నియోజ కవర్గంతో పాటు రామాయపట్నం పోర్టు ప్రకాశం జిల్లాలో చేరిపోతుందని, . సర్వేపల్లి కొత్త జిల్లా గూడూరులో కలిస్తే నెల్లూరు జిల్లా ప్రజలు కృష్ణపట్నం పోర్టును కూడా కోల్పోతారని, ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు, విక్రమ సింహపురి యూనివర్సిటీతో పాటు ఎంతో ప్రాముఖ్యతను నెల్లూరు కోల్పోతుందని, . జిల్లాలో ప్రధాన జలాశయమైన సోమశిల ప్రాజెక్టు కింద ఆయకట్టు మొత్తం ఎక్కువ శాతం కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోనే ఉందన్నారు. సర్వేపల్లిని తీసుకెళ్లి గూడూరులో కలిపితే సాగునీటి పరంగానూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా ప్రాముఖ్యతను తగ్గించే ప్రయత్నాన్ని జీర్ణించు కోలేకపోతు న్నామని, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల కోరిక ప్రకారం నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు :ఓ ముస్లిం యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈసంఘటన నెల్లూరులోని మూలాపేట,అలంకార్ సెంటర్ ప్రాంతంలోని విక్టోరియా గార్డెన్స్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట అలంకార్ సెంటర్‌కు చెందిన షేక్ లైక్ (36) క్యాటరింగ్ పనుల కోసం వెళుతూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం పాల ప్యాకెట్ కోసం బయటకు వచ్చాడు. అంతలోనే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు.షేక్ లైక్ స్నేహితుడైన నూర్‌తో ఇటీవల నెలకొన్న చిన్నపాటి వివాదం కారణంగా ఈ హత్య చోటు చేసుకుందా.. లేక మరే ఇతర కారణాలతోనైనా ఈ హత్యకు ఒడిగట్టారా అనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. మృతుడు, నూర్ అనే యువకుడు ఇద్దరు స్నేహితులే. ఈ సమాచారం తెలు సుకున్న ఒకటో నగర పోలీసు స్టేషన్ సిఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :నెల్లూరు నగరపాలక సంస్థలో భూగర్భ డ్రెయిన్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన డ్రైవర్ టి.రమణయ్య, వర్కర్ బి. పరంధామయ్యలను కమిషనర్ వై.ఓ నందన్ ఘనంగా సత్కరించారు. హరనాథపురం పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ.ఈ రహం తు జానీ, అనిల్ కుమార్,డి.ఈ.ఈ. ముజాహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్‌లు తప్పనిసరి

ప్రజాశకి - నెల్లూరు కార్పొరేషన్ : అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారిగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి వ్యాపారస్తులంతా ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా, క్రమం తప్పకుండా లైసెన్సులను రెన్యువల్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ టి.పి.ఆర్.ఓ వాసుబాబు ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, మలేరియా విభాగం అధికారి డాక్టర్ జిజియా బాయి ఉన్నారు.

వైసిపిని శాశ్వతంగా బహిష్కరిస్తారు..

ప్రజాశక్తి-కందుకూరు :వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట మండలాలలో మంగళవారం జరిగిన జెడ్పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా ఆయా మండలాల ప్రజలు కులమతాలకతీతంగా మూకుమ్మడిగా కూటమి అభ్యర్థులకు పట్టం కట్టేందుకు బారులు తీరి ఓట్లు వేశారని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వికృత చేష్టలకు రాష్ట్ర ప్రజలతో పాటు సొంత జిల్లా అయిన వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజలు కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని , జగన్ మోహన్ రెడ్డిని ఎన్నికల నుండి శాశ్వతంగా బహిష్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తేటతెల్లమవుతుందన్నారు.



మోషే, టిడిపి నేత

ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కాకు తిరిపాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కాకు కిరణ్ బాబుకందుకూరు పట్టణంలో కోవూరు రోడ్డులో స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలలో బుధవారం ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్య వైశ్య మీడియా ఛైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ పెద్దవారిని స్మరించుకునేటప్పుడు సేవా కార్యక్రమం చేయడం ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు.కార్యక్రమంలో కిరణ్ స్నేహితులు చక్కా చైతన్య గుప్తా నరేష్, నజీర్, సమీర్ ఉన్నారు.



మరణానంతరం అవయవదానం చేస్తా..

- కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద



ప్రజాశక్తి-కావలి : అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదని, దాని ద్వారా ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మరణానంతరం అవయవదానం చేస్తానని ప్రకటించారు. గతంలో అన్నదానం, ఆ తర్వాత రక్తదానం గొప్పవని చెప్పేవారు కానీ, అన్ని దానాల కంటే అవయవదానం అత్యంత గొప్పది అని అన్నారు. మరణానంతరం మన శరీరం మట్టిలో కలిసిపోతుంది లేదా కాలి బూడిదవుతుందని అదే శరీరంలోని అవయవాలను దానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోసిన వారవుతాం అని సంప్రదాయాలను కన్నా మానవత్వం మిన్న అని మనం గుర్తించాలని శారద అన్నారు. భారతదేశంలో అవయవ మార్పిడి అవసరమైన వారి సంఖ్య లక్షల్లో ఉంటే, దానం చేయడానికి ముందుకు వచ్చే వారు మాత్రం చాలా తక్కువగా ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కుల, మత సంప్రదాయాలు, విశ్వాసాలు దానికి అడ్డుగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అవయవాలు పనిచేయక వ్యాధులతో బాధపడుతున్న ఎందరికో అవయవ దానం ద్వారా పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉంటుందని, ఈ అమూల్యమైన అవకాశాన్ని ఎవరూ వదులుకోకూడదని ఆమె విజ్ఞప్తి చేశారు. అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, శాస్త్ర విజ్ఞాన వేదికలు ముందుకు రావాలని శారద కోరారు. అలాగే, ఎవరైనా మరణిస్తే, వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించేలా "ఉదాత్త అనుమతి భావన" గురించి కూడా ఆమె వివరించారు. వివరిగా, తాను 70ఏళ్ల మరణానంతరం తన అవయవాలను దానం చేయడానికి అంగీకరం చేస్తున్నట్లు ప్రకటించి, తనస్ఫూర్తితో మరికొంతమంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'డిబిఎస్'లో అవయవదాన దినోత్సవం



ప్రజాశక్తి-కావలి : ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ ధూమ పానం చాలామందిలో ప్రమాదమని తెలిసినా ఉండే అలవాటు ఇది. అధికంగా ధూమపానం చేయడం వల్ల అనేక అనారోగ్యాలకు కారణం అవుతుందన్నారు. పొగ తాగేవారికే కాదు పొగను పీల్చేవారిలో కూడా వ్యాధులు తప్పవన్నారు. కార్యక్రమంలో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు, లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వి.శ్రీధర్, లైన్స్ క్లబ్ నెల్లూరు క్లబ్ ప్రెసిడెంట్, ఏ.కాశీ, బి.శ్రీకృష్ణ కుమార్, ఎం మోహన్ రావు, వైవి రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం గంగ వరం గ్రామంలోని గీతాంజలి కళాశాల విద్యార్థులు అంతరిక్ష శాస్త్ర సాంకేతికతపై అవగాహన ఆసక్తిని పెంపొందించడానికి నిర్వహించిన 2025 జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో బుధవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ప్రదర్శనలు, మోడల్ రాకెట్ ప్రదర్శనలు, అంతరిక్ష క్విజ్, శాస్త్రవేత్తలతో ఇంటరాక్టివ్ సెషన్లు ఉన్నాయి. ఈ సందర్భంగా ఖగోళశాస్త్రానికి సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ గణితం వంటి కెరియర్ల వైపు రానున్న తరాన్ని ప్రేరేపించడంలో ఇటువంటి వేడుకలు కీలకపాత్ర పోషిస్తాయని నిర్వాహకులు సూచించారు. షార్ ప్రాజెక్టులో గీతాంజలి విద్యార్థులు పలు ఉపగ్రహ, సాంకేతికత గ్రహ అన్వేషణ, తదితర ప్రాజెక్టులను పరిశీలన చేపట్టారు.

బుక్కాపురం గ్రామానికి బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామానికి పల్లె వెలుగు బస్సు సౌకర్యం కల్పించారని గ్రామ సర్పంచ్ అధికార పార్టీ నాయకులు తెలిపారు. బుక్కాపురం గ్రామానికి లోపలి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక సరిగా ఆటోలు రాక ప్రజలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయమని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ దృష్టికి తెలిపారు. ఆయన చొరవతో ఆటిసి డిపో మేనేజర్ ఎస్.సురేష్ రెడ్డితో మాట్లాడి ఓకే చేయడం జరిగిందన్నారు. ఈ కొత్తగా వేసిన బస్సు ఆత్మకూరు వింజమూరు వయా బుక్కాపురం మీదగా ఉదయం సాయంత్రం రోజుకు రెండు పర్యాయములు గ్రామానికి వస్తూ ఉంటుందని తెలిపారు. ఈ బస్సు సౌకర్యంతో ఆ గ్రామ ప్రాంతాల్లోని ప్రజలు విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు క్లస్టర్ కన్వీనర్ మాల్యాద్రి నాయుడు, సర్పంచ్ రసూల్, ఉప సర్పంచ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని కరటంపాడు, బోయిన చిరువెళ్ళ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి రైతు సేవాకేంద్రాల రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు మాట్లాడుతూ రైతులు సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతుల పాటించినప్పుడే అధిక దిగుబడులు పొందటంతో పాటు ఖర్చులు తగ్గించుకునే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు లక్ష్మీలహరి, ఎస్.మంజుల, ఎపిసిఎన్ఎఫ్ శాఖ సిబ్బంది కరటంపాడు, బోయిల చిరువెళ్ల రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పాతాళపల్లి గ్రామంలో ఆత్మవారి సౌజన్యంతో మండల వ్యవసాయ అధికారిణి ఈ.శైలజకుమారి ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బిజీవేముల ఓబులరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారిణి కె.కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ, విఎఎలు వెంకటసుబ్బయ్య, జ్యోత్స్న పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు కిట్లు పంపిణీ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆత్మకూరు వెస్ట్ స్కూల్ భవిత కేంద్రంలో బుధవారం వికలాంగ విద్యార్థులకు కిట్లను ఎంఇఒ ఎం.అనంత లక్ష్మీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్ఎ, అలిమ్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగులకు కిట్ల పంపిణీ చేయడం సంతోషకరమని ఆమె అన్నారు. తల్లిదండ్రులకు భవిత కేంద్రాల ప్రయోజనాలు, రాయితీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు కాటం పద్మ, ఆళ్ళ జయకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట : రైల్వే ఉద్యోగి పి సురేష్, (ఎస్ఆర్) తల్లి 7వ వర్ధంతి బోగోలు మండలం ముంగమూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన ఉన్న భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీయుల ఆధ్వర్యంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి సురేష్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సురేష్ కుటుంబ సభ్యులు లావణ్య ట్రిక్కు, టూటీ, పెర్సీ, సిరాజ్, డబీర్ శ్రీధర్, బి.ఎం.ఆర్. యువసేన మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ..

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని వేగూరు గ్రామ పంచాయతీ మజారా సుబ్బారెడ్డిపురం దగ్గర.ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దానిని పగలగొట్టి అందులో ఉన్న రాగివైరును అపహరించుకు పోయారు. ఈ మేరకు బుధవారం సమాచారం అందుకున్న ట్రాన్స్కో ఏఈ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఈ మేరకు కోవూరు పోలీస్టేషన్లో ట్రాన్స్ ఫార్మర్ చోరీ విషయమై ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయిన నేపథ్యంలో సుబ్బారెడ్డిపురం ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండల పరిధిలోని వాశిలి వద్ద నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. నెల్లూరు నుండి బద్వేల్ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు టీవీయస్ లూనా వాహనంలో వెళ్తున్న అన్వర్‌ను వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అన్వర్ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్ఐ జిలాని సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : నెల్లూరు - కడప జిల్లా సరిహద్దు వద్ద అదుపు తప్పి కోళ్ల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. అలాగే కంద్రిక నుండి పొంగూరు మీదుగా కారులో గౌరవరం వెళ్తుండగా పొంగూరు చెరువు కట్ట మలుపు వద్ద అదుపు తప్పి కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

దళితులపై దాడులను అరికట్టాలి

- కెవిపిఎస్ డిమాండ్



మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో దళితులపై జరుగుతున్న వరుస దాడులను అరికట్టాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ వ్యాఖ్యానించింది. బుధవారం బాలాజీ నగర్‌లోని కెవిపిఎస్ ఆఫీసులో నేలపాటి రఘురామయ్య అధ్యక్షతన కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా బాధ్యులు మంగళ.పుల్లయ్య, అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో మండలానికి ఒక కార్యకర్తలను గుర్తించి ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. ఈ మధ్య జిల్లాలో దళితులపై వరుసగా దాడులు జరుగుతున్నప్పటికీ కలెక్టర్, ఎస్పీ స్పందించకపోవడం, ఆట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించక పోవడంతో దాడులు పునరావృతం అవుతున్నాయన్నారు. మనుబోలు మండలం కొండుపాలెం పంచాయతీలో గుండెపోగు మీరమ్మపై అదే గ్రామంలోని యాదవ కులానికి చెందిన ఆనాల శీనయ్య ఆనాల సతీష్‌లు మీరమ్మ దుస్తులు చించి దాడి చేశారని, ఆత్మకూరు రూరల్ మండలం బసవరాజుపాలెం దళిత వాడకు చెందిన పేర్పాటి విజయ్‌ను అదే గ్రామం యాదవ కులానికి చెందిన గుండుబోయిన నరసింహులు ప్రధాన గ్రామం దారి గుండా పోయేదానికి లేదంటూ బెదిరించారని, చేజర్ల మండలం మడమర్రి గ్రామంలో లింగంగుంట వసంతమ్మపై అదే గ్రామానికి చెందిన వెలమల సుబ్బారెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, ఈగ నారాయణరెడ్డిలు వసంతమ్మకు చెందిన 2 యకరములు ఏటి పోరంబోకు భూమిలో 10ఏ. వేసుకున్న వరిపైరును దున్నివేసి, మినిలిన బెండ చెట్లు పీక్కుడు చెట్లను పీకి వేశారన్నారు. అడ్డువచ్చిన వసంతమ్మపై దాడి చేసి గాయపరచారని తెలిపారు. దాంతో ప్రస్తుతం ఆమె ఆత్మకూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుందని తెలిపారు. బోగోలు మండలం తెల్లగుంట గ్రామం బొందు వంద్ పక్క గ్రామం సిద్ధనపాలెంకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో సిద్ధనపాలెం యాదవ కులానికి చెందిన 40మంది యువకులు తెల్లగుంట దళితవాడపై దాడి చేసి మహిళలను గాయపరిచినారని, సైదాపురం మండలం మొలకల పూండ్ల పంచాయతీ కమ్మవారిపల్లెలో తురక మస్తానయ్య గడ్డం దిబ్బ తిప్ప పోరంబోకు భూమిలో వేసుకున్న నిమ్మ చెట్లను పల్లేటి వెంకటేశ్వర్లు నాయుడు ఏప్రిల్ చొరవ ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చి 5 ఎకరాలలో వేసుకున్న కాపు మీద ఉన్నటువంటి చెట్లను జెసిబి పెట్టి పెరికి వేశారన్నారు. ఇన్ని రకాలుగా దళితులపై దాడులు జరుగుతు న్నా.. బాధితులకు న్యాయం జరగడం లేదని, కావున దాడులు చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.సుధీర్, నాయకులు ఆత్మకూరు నాగయ్య, డివిఎంసి సభ్యులు శేషం.సుదర్శన్, కె.జాన్, దారా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే "పి-4" లక్ష్యమని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం పి4 కార్యక్రమంపై ఆర్‌డిఒ సన్నీ వంశీకృష్ణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్న కుటుంబాలను ఆదుకోవడం కోసం ఈ పి4 కార్యక్రమాన్ని రూపొందించామని, ముఖ్యమంత్రి స్వయంగా పేద కుటుంబాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా ఈ కార్య క్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పేద వర్గాలకు మార్గదర్శకులుగా వ్యవహరించాలని కోరారు. కావలి నియోజక వర్గంలో 9వేల పేద కుటుంబాలను గుర్తించి ట్ర, గ్యాస్ కనెక్షన్లు లేని, ఇంకా కష్టాల మీద ఆధార చేసుకునే కుటుంబాలు అధికంగా ఉన్నాయని వివరించారు. ఈ కుటుంబాలను "బంగారు కుటుంబాలు"గా మార్చడం లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి ఒక మార్గదర్శిని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంలో 1350మంది పేద కుటుంబాలను దత్తత తీసుకో వడానికి ముందుకు వచ్చారని ఆయన వెల్లడించారు. దత్తత ప్రక్రియపై ఉన్న అపోహలను తొలగిస్తూ, దానివల్ల ప్రభుత్వాలు లేదా బ్యాంకులు ఇబ్బంది పెట్టవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తే సమాజం సంపన్నంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, మార్గదర్శులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు



ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు సొసైటీ చైర్మన్‌గా చల్లా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. పెరుతోపాటు డైరెక్టర్లుగా కోమరు నాగిరెడ్డి గని శ్రీనివాసులు నాయుడు సంతకం చేశారు. అనంతరం చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరూ సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి చల్ల శ్రీనివాసులు రైతులందరికీ న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి చల్ల శ్రీనివాసులు యాదవ్, డి శ్రీనివాసుల రెడ్డి, మేకల రమణయ్య యాదవ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పలు కార్యక్రమాల్లో ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావలి పట్టణం బృందావనం కాలనీకి చెందిన పట్నతి వెంకటేశ్వర్లు-భార్య లక్ష్మి దంపతుల కుమారుడు ప్రసన్న వెంకట సాయి శ్రీకాంత్ వివాహ రిసెప్షన్ కార్యక్రమం బృందావనం కాలనీలోని కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి పట్టణం జనతాపేట నార్త్‌కు చెందిన గంటా విజయకుమార్ - మనోరమ దంపతుల కుమార్తె గీతాంజలి వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మానం వేణు - ప్రమీల దంపతుల కుమార్తె లక్ష్మి ప్రియ వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యెండేటి ప్రసాద్ - కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె మేఘన వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన కన్నా కేశవులు - లావణ్య దంపతుల కుమార్తె దివ్య వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి పట్టణం కో-ఆపరేటివ్ కాలనీకి చెందిన రెవెన్యూ ఉద్యోగి బాలాజీ సింగ్ ఉత్తర క్రియల కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని బాలాజీ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కావలి పట్టణం బాపూజీ నగర్‌కు చెందిన రామిరెడ్డి వెంకట రమణారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం వారి నివాసానికి చేరుకుని రమణారెడ్డి మృతదేహాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే ఆధారపడి ఉంటుందని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి కాజా మొహిద్దీన్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని ఆర్వివల్ఖినేపురం, కరటంపాడు, మహిమలూరులో ఉన్న మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ అధికారి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలకు సమయానికి హాజరు కావాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే ఆధారపడి ఉన్నదని తెలిపారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉన్నదని, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించినప్పుడే ఎన్‌రోల్‌మెంట్ పెరుగు తుందన్నారు. అలాగే ఎఫ్ఎ-1 పరీక్షల మార్కులను ఆన్లైన్ చేయాలని, విద్యార్థులను డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్త పరిచారు. వీరివెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రిజిష్టర్లను పరిశీలిస్తున్న అధికారి

14న జాబ్‌మేళా

ప్రజాశక్తి-కోవూరు : ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 14న కోవూరులోని వైజాక్ - కె గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ జాబ్ మేళాలో ఫార్మా, మార్కెటింగ్, మెకానికల్ రంగాలకు చెందిన 13 కంపెనీలు పాల్గొంటాయని ఆమె ప్రకటనలో తెలియజేశారు. దాదాపు 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతోజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.

గడువు పొడిగింపు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 10వ తరగతి మెరిట్ ద్వారా 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ చివరి తేదీని పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పేతనసామి పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఆగస్టు 20వ తేదీ వరకు పొడిగించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9346022106, 9440094090 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వైద్యసేవల ధరలను ప్రదర్శించాలి

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్య సేవకు తీసుకుంటున్న ధరలను బోర్డులపై బహిరంగంగా ప్రదర్శించాలని కొడవలూరు వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. ఆయన బుధవారం నార్త్ రాజుపాలెంలోని ప్రశాంతి నర్సింగ్ హోమ్, దీప్తి నర్సింగ్ హోమ్ ప్రజా వైద్యశాల ప్రయివేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలకు వైద్య పరీక్షలకు వైద్యుల అర్హతలను ఆసుపత్రి అనుమతులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి వైద్యశాల తప్పనిసరిగా అన్ని అనుమతులను కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ అనుమతులు తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి బాలచంద్రబాబు

వారైతే తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వైద్య సేవలకు బోర్డుపై ప్రదర్శించిన ధరలనే తీసుకోవాలన్నారు. నార్త్ రాజుపాలెంలో పలు ప్రయివేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేదన్నారు. ఇప్పటికే గుర్తించి డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. వీరందరూ త్వరగా డిఎం అండ్ హెచ్ ఒ కార్యాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆయనవెంట ఎస్.కె షఫీ ఉద్దీన్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అది జీవితాన్నే నాశనం చేస్తుందని ఆత్మకూరు సిఐ గంగాధర్ అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఎస్వి డిగ్రీ కళాశాలలో సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో తలెత్తే పరిణామాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులుగా మారిన వారందరూ క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేశారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థి దశలో ర్యాగింగ్ లాంటి వాటికి దూరంగా ఉండాలని, డ్రగ్స్ జోలికి అసలు వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఒ-2 వై.చెంచులక్ష్మమ్మ ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆట పాటలతో కూడిన విద్యను కూడా అందించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూతో పాటు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వైదేహి, తదితరులు ఉన్నారు.

కూలీల శాతాన్ని మరింత పెంచాలి

ప్రజాశక్తి-కోవూరు : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు గానూ కూలీల శాతాన్ని మరింత పెంచేలా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో మారిన హాజరు దృష్ట్యా తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్లో రెండు పూటలా హాజరు వేయాలన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సాధిక్ ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కోవూరు



ప్రభుత్వం చెవిముట్టించక పోవడంతో ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులు మరోసారి ఉద్యమ బాట పట్టారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 12, 13 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లలో రెండు రోజులపాటు ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉద్యోగులు చెబుతున్నారు తాము రోడ్డు మీద వర్షం, ఎండ తేడా లేకుండా కష్టపడతాం కానీ ప్రభుత్వం మాత్రం తమ హక్కుల విషయంలో తమకు ఎండ కరువు, వర్షం కరువు ఒకేలా చూపిస్తోందా అని హెచ్చరించారు. ఈ రెండు రోజుల ధర్నా కార్యక్రమాలు కేవలం ఆరంభమే అని, ఆగస్టు 13 తరువాత పోరాటాన్ని మరింత ముమ్మరం చేస్తాంఅని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు స్పష్టం చేశారు.

'స్త్రీశక్తి' ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-కావలి



స్త్రీశక్తి (మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం) ప్రారంభానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్‌కె.షమీమ్ తెలిపారు. బుధవారం ఆమె కావలి డిపోను సందర్శించి, అధికారులు, సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఈ పథకాన్ని కావలి డిపోలో ఎంఎల్ఎ దగుమాటి కృష్ణారెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఆర్‌టిసిలో పనిచేసే అన్ని విభాగాల సిబ్బంది, అన్నీ యూనియన్ల ప్రతినిధులు మహిళలకు ఆహ్వానం పలకాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించానున్న ఈ పథకం వలన ఆర్‌టిసికి మంచిపేరు వచ్చేలా సిబ్బంది పనిచేయాలని వివరించారు. ఇప్పటికే బస్సుల కండిషన్ మెరుగు పరిచామని, కండక్టర్లకు, డ్రైవర్లకి ఉచిత టికెట్ ఇవ్వడంలో శిక్షణ ఇచ్చామని అన్నారు. బస్సులను, బస్టాండ్‌లను అలంకరించాలని ఆమె సూచించారు. మహిళలతో ఎలాంటి వివాదాలు రాకుండా సహనం వహించాలని కోరారు. కార్యక్రమంలో కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) యం కల్పనా రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్‌కె.ఖాజా మొహిద్దీన్, డిఇఇ (సివిల్) ఎస్‌కె ఫయాజ్, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.